క్లుప్తంగా

యనమదల అంగన్‌వాడీలో 'పాఠశాల సంసిద్ధత'



యనమదల (ప్రత్తిపాడు): యనమదల డీడబ్ల్యూ అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం పాఠశాల సంసిద్ధతా కార్యక్రమాన్ని నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్త జ్యోతి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి స్థానిక ఆర్‌సీఎం పాఠశాల ఉపాధ్యాయులు ఎంఎల్‌జీ శాంతయ్య హాజరయ్యారు. చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. అనంతరం ఒకటవ తరగతిలో చిన్నారులను చేర్పించుకున్నారు.

వట్టిచెరుకూరు ఎంఈవోగా జి. సత్యనారాయణమూర్తి



వట్టిచెరుకూరు (ప్రత్తిపాడు): వట్టిచెరుకూరు మండల విద్యాశాఖాధికారిగా జి.సత్యనారాయణ మూర్తి సోమవారం బాధ్యతలు చేపట్టారు. మండలంలో కొద్ది నెలలుగా ఎంఈవో పోస్టు ఖాళీగా ఉండటంతో ప్రత్తిపాడు ఎంఈవో రమాదేవి ఇన్‌చార్జి ఎంఈవోగా అదనపు విధులను నిర్వర్తిస్తున్నారు. ఈ నేపథ్యంలో డైట్ కళాశాల నుంచి జి.సత్యనారాయణమూర్తిని ఎంఈవో-1గా నియమిస్తూ జిల్లా విద్యాశాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఆయన స్థానిక విద్యావనరుల కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఎంపీడీవో జి.శేషగిరిరావును మర్యాదపూర్వకంగా కలిశారు. విద్యాభివృద్ధికి కృషి చేయడం జరుగుతుందని ఎంఈవో తెలిపారు.

చేబ్రోలు ఇంజినీరింగ్ కళాశాలకు అటానమస్ గుర్తింపు



చేబ్రోలు: చేబ్రోలులోని ఆర్‌వీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఆర్‌వీఐటీ) కళాశాలకు అటానమస్‌గా గుర్తింపు లభించినట్లు చైర్మన్ జి.మస్తాన్ చౌదరి సోమవారం తెలిపారు. జేఎన్‌టీయూ కే యూనివర్శిటీ వైస్ చాన్సలర్ జీవీఆర్ ప్రసాదరాజు, రిజిస్ట్రార్ ఎల్.సుమలత, రెక్టార్ కేవీ రమణ అటానమస్ గుర్తింపు పత్రాలను కళాశాల చైర్మన్ గొట్టిపాటి మస్తాన్ చౌదరి, ప్రిన్సిపల్ ఆర్వీ కృష్ణయ్యకు అందజేశారు. యూజీసీ ఇచ్చిన ఈ అటానమస్ గుర్తింపు పదేళ్ల అమలులో ఉంటుందని తెలిపారు. ఈ విద్యా సంవత్సరం ప్రారంభం నుంచి అమలులోకి వస్తుందని చైర్మన్ చౌదరి తెలిపారు. జేఎన్‌టీయూ కే యూనివర్శిటీలో జరిగిన కార్యక్రమంలో అటానమస్ గుర్తింపు పత్రాల స్వీకరణలో యూనివర్శిటీ డైరెక్టర్ సాయిబాబా, డీఈ బాలకృష్ణ డీపీపీ మురళీ కృష్ణ పాల్గొన్నారు.

చౌత్రా స్కూల్లో స్వస్థ ఇండియా కార్యక్రమం

గుంటూరు ఎడ్యుకేషన్: చౌత్రా సెంటర్లోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో సోమవారం డెట్టాల్ బనేగా స్వస్థ ఇండియా ఆధ్వర్యంలో హైజీన్ కల్చర్ ప్రమోషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా శార్ప్ గ్రామాలయ సహకారంతో విద్యార్థినులకు హ్యాండ్ వాష్ ప్రాముఖ్యత వివరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయిని బి.విజయలక్ష్మి మాట్లాడుతూ జిల్లాలోని 40 పాఠశాలల్లో హ్యాండ్ వాష్ వాల్ పెయింటింగ్ చేశారని తెలిపారు. కార్యక్రమంలో ఉర్దూ డీఐ షేక్ ఎండీ ఖాసిం, డీబీఎస్ఈ ప్రోగ్రామ్ మేనేజర్ నళిని, రాజ్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపశమనపు చినుకులు!

నెహ్రూనగర్: గుంటూరు నగరంలో సోమవార సాయంత్రం వర్షం కురిసింది. వేసవికాలం ముగిసినప్పటికీ ఎండ తీవ్రత తగ్గకపోవడంతో నగర ప్రజలు తీవ్ర అవస్థలు పడాల్సిన పరిస్థితి నెలకొంది. ఓ పక్క ఎండ వేడిమి ఉక్కపోతతో అల్లాడిపోతున్న నగర్ వాసులకు వర్షాలు పడటం ఒకింత ఉపశమనాన్ని కలిగించింది.

రాజ్యాంగంపై రాత పరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం

గుంటూరు మెడికల్: రాజ్యాంగంపై ప్రతి ఒక్కరిలో అవగాహన పెంచేందుకు సెప్టెంబరు 10న రాత పరీక్ష నిర్వహిస్తున్నట్లు కుల నిర్మూలన కలయిక సంస్థకు ఉపాధ్యక్షుడు టి.కిరణ్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజ్యాంగం గురించి పరీక్ష రాజేందుకు 15 పైబడిన ప్రతి ఒక్కరూ అర్హులని పేర్కొన్నారు. మెరిట్ సాధించిన పది మందికి బహుమతులు అందజేస్తామని, బహుమతులు రాజ్యాంగ దినోత్సవం రోజు జరిగే సభలో అందజేస్తామన్నారు. ఇతర వివరాలకు 70326 86204, 9441268501 నంబర్లను సంప్రదించాలన్నారు.

పంచాయతీ క్యాష్ బుక్‌కు కాళ్లు..?

- గొట్టిపాడు పంచాయతీలో నిధుల దుర్వినియోగం ఘటన..
- సస్పెన్షన్‌కు సిఫారసు చేసిన గ్రేడ్-1 సెక్రటరీ చేతికి చేరిన క్యాష్‌బుక్
- గుట్టుచప్పుడు కాకుండా పంచాయతీ నుంచి బయటకు..
- తీసుకువెళ్లి సెక్రటరీకి అందజేసిన సిబ్బంది



గొట్టిపాడు పంచాయతీ కార్యాలయం

పెదగొట్టిపాడు (ప్రత్తిపాడు): క్యాష్ బుక్‌కు కాళ్లొచ్చాయి. పంచాయతీలోని రికార్డు రూంలో ఉండాల్సిన క్యాష్‌బుక్ అక్కడ మాయమై, సస్పెన్షన్‌కు సిఫారసు చేసిన ఓ గ్రేడ్-1 సెక్రటరీ చేతికి చేరినట్లుగా తెలుస్తోంది. వివరాలిలా ఉన్నాయి. ప్రత్తిపాడు మండలం పెదగొట్టిపాడు గ్రామ పంచాయతీలో నిధులు దుర్వినియోగం జరిగాయంటూ కొద్ది నెలల కిందట ఉప సర్పంచ్ నిమ్మగడ్డ శివరంజని చేసిన ఫిర్యాదు నేపథ్యంలో డివిజనల్ పంచాయతీ అధికారి పంచాయతీలో విచారణ జరిపారు. నిధుల దుర్వినియోగం నిజమేనని నిర్ధారించి డీపీవోకు నివేదించడతో, ఆయన కలెక్టర్‌కు సమగ్ర నివేదిక సమర్పించారు. దీంతో గత నెలలో బాధ్యులైన గ్రేడ్-4 సెక్రటరీని సస్పెండ్ చేయగా, మరో ఇద్దరు గ్రేడ్-1 సెక్రటరీల సస్పెన్షన్‌కు కలెక్టర్ ఆ శాఖ కమిషనర్‌కు సిఫారసు చేయడం, ఇదే విషయంలో సర్పంచ్ చెక్ పవర్‌ను తాత్కాలికంగా మూడు నెలల పాటు రద్దు చేసిన విషయం తెలిసిందే.

అయితే ఇంకా సస్పెన్షన్ల పర్వం పూర్తి కాకుండానే, అదే పంచాయతీలో మరో నిర్వాకం చోటుచేసుకుంది. పంచాయతీ గుమస్తా పర్యవేక్షణలో రికార్డు రూమ్‌లో భద్రంగా ఉండాల్సిన అత్యంత కీలకమైన క్యాష్‌బుక్‌కు కాళ్లొచ్చాయి. పంచాయతీలో మాయమైన క్యాష్‌బుక్ నగదు దుర్వినియోగం విషయంలో కలెక్టర్ సస్పెన్షన్‌కు సిఫారసు చేసిన ఓ గ్రేడ్-1 సెక్రటరీ చేతికి చేరింది. అది కూడా ఎందుకో తెలుసా.. ఆయన ఇన్‌చార్జిగా ఉన్న సమయంలో జరిగిన లావాదేవీలు, పన్నుల వసూళ్లకు సంబంధించిన వివరాలను నమోదు చేసుకునేందుకట. ఇందుకోసం ఏకంగా గుట్టుచప్పుడు కాకుండా పంచాయతీలోని సిబ్బందే నగదు పుస్తకాన్ని రికార్డు రూమ్ నుంచి బయటకు తీసి, గ్రేడ్-1 సెక్రటరీకి అందించారు. నాలుగు రోజుల కిందటే క్యాష్ బుక్‌ను రికార్డు రూమ్ నుంచి బయటకు తీసి సెక్రటరీకి అందించారు. అయితే దీనిపై ఉప సర్పంచ్‌తో పాటు స్థానికులు కొందరు ఆరా తీయడంతో విషయం ఆలస్యంగా వెలుగు చూసింది. క్యాష్ బుక్‌ను బయటకు తరలించిన పంచాయతీ సిబ్బందిపై జిల్లా పంచాయతీ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.

క్యాష్‌బుక్‌ను గుమస్తానే తీసుకొచ్చి నాకు ఇచ్చాడు

క్యాష్ బుక్‌ను నేను తీసుకోలేదు. నేను గొట్టిపాడుకు ఇన్‌చార్జిగా ఉన్న సమయంలో చేసిన పంచాయతీ పన్నుల వసూళ్లకు సంబంధించిన నగదు ఎంట్రీ ఒకటి చేసి ఇవ్వడం కోసం క్యాష్ బుక్‌ను పంచాయతీ గుమస్తానే నా వద్దకు తీసుకువచ్చి ఇచ్చాడు. నేను ఎంట్రీ చేసిన తరువాత తీసుకెళ్లమని కూడా ఫోన్ చేసి చెప్పాను. సాయంత్రం వచ్చి తీసుకువెళతానన్నాడు. ఇంకా తీసుకువెళ్లలేదు. నా వద్దనే గొట్టిపాడు పంచాయతీ క్యాష్ బుక్ ఉంది.

– శివాజీ, కార్యదర్శి, తుమ్మలపాలెం.

క్యాష్‌బుక్ ఇచ్చిన వారిపై చర్యలు తప్పవు

క్యాష్ బుక్ అనేది పంచాయతీలోని రికార్డు రూమ్‌లోనే ఉండాలి. పంచాయతీ గుమస్తా అలా సస్పెన్షన్‌కు సిఫారసు చేసి సెక్రటరీకి ఎంట్రీ కోసం ఇవ్వడం కరెక్ట్ కాదు. పంచాయతీ గుమస్తాపై కూడా కచ్చితంగా కఠినమైన చర్యలు తీసుకుంటాం. విధుల్లో నిర్లక్ష్యం వహించినా, దుర్వినియోగానికి పాల్పడినా ఉపేక్షించం.

– ఆర్.కేశవరెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి, గుంటూరు.

ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు



బాబాకు పల్లకిలో గ్రామోత్సవం

కాకుమాను: స్థానిక శ్రీ చెన్నకేశవ స్వామి దేవస్థానంలోని సాయిబాబా మందిరంలో గురుపౌర్ణమి సందర్భంగా సోమవారం భక్తులు బాబాను ప్రత్యేకంగా అలంకరించి, విశేష పూజలు చేశారు. సాయంత్రం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పల్లకిలో సాయిబాబాకు గ్రామోత్సవం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు బాబాను దర్శించుకున్నారు.

గోరంట్లలో అన్నదానం

గుంటూరు రూరల్: గురుపౌర్ణమి సందర్భంగా సోమవారం గోరంట్ల గ్రామంలోని సాయిబాబా దేవస్థానంలో మాజీ సర్పంచ్ యర్రంశెట్టి వేణుగోపాల్ ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని గుంటూరు నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు, వేద సీడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తులసి ధర్మచరణ్ ప్రారంభించారు. ముందుగా స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి, వేద పండితుల ఆశీర్వాదం స్వీకరించారు. తులసి ధర్మచరణ్ మాట్లాడుతూ గోరంట్లలోని దేవాలయాల అభివృద్ధికి యర్రంశెట్టి వేణుగోపాల్ నిరంతర శ్రామికుడిలా కృషిచేస్తున్నారన్నారు. కార్పొరేటర్ యర్రంశెట్టి పద్మావతి, యర్రంశెట్టి సూరి, తోట రంగారావు, ప్రసన్నాంజనేయస్వామి తదితరులు పాల్గొన్నారు.



బాబా మందిరంలో గురుపౌర్ణమి పూజలు చేస్తున్న అర్చకులు

సాయినాథునికి ప్రత్యేక పూజలు

పెదనందిపాడు: గురుపౌర్ణమి సందర్భంగా పెదనందిపాడు సాయి మందిరంలో సాయినాథునికి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. దాదాపు 10వేల మంది భక్తులకు అన్నదానం చేశారు. ప్రకాశం, బాపట్ల, గుంటూరు జిల్లాల నలుమూలల నుంచి తరలివచ్చి భక్తులు బాబాను దర్శించుకున్నారు.

పెదకాకాని: పెదకాకాని, వెనిగండ్ల, కొప్పురావూరు, తక్కెళ్ళపాడు ఉప్పలపాడు నంబూరు గ్రామాల్లోని సాయిబాబా మందిరాల్లో సోమవారం గురుపౌర్ణమి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాల నిర్వాహకులు భక్తులకు అన్న సంతర్పణ చేశారు.



అన్నదానం చేస్తున్న మేయర్ మనోహర్ నాయుడు, తులసి ధర్మచరణ్

సాయినాథునికి ఎమ్మెల్యే పూజలు

చేబ్రోలు: పొన్నూరు రూరల్ మండలం మామిళ్లపల్లి గ్రామంలోని షిర్డీ సాయిబాబా ఆలయంలో సోమవారం గురుపౌర్ణమి ప్రత్యేక పూజలను ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య చేశారు. అర్చకులు పంచామృత అభిషేకాలు, విశేష కార్యక్రమాలు నిర్వహించారు.

రూ.7లక్షల విరాళం

మునిపల్లె గ్రామంలోని మసీదు, ఉర్దూఘర్ నిర్మాణానికి పట్టణానికి చెందిన బాంబే ఆప్టికల్స్ బాబు సోమవారం రూ.7లక్షలు విరాళంగా అందజేశారు. ఉర్దూఘర్ నిర్మాణానికి నాలుగు సెంట్ల స్థలాన్ని ప్రభుత్వం మంజూరు చేసింది. స్థానిక మతపెద్దలకు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య స్థల మంజూరు పత్రాలను అందజేశారు. రాష్ట్ర ముస్లిం మైనార్టీ కమీషన్ సభ్యుడు షేక్ సైపుల్లా, గ్రామ సర్పంచ్ కూచిపూడి స్వరూపారాణి, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

ఇండోర్ స్టేడియం పరిశీలన



ఇండోర్ స్టేడియాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కిలారి

పొన్నూరు పట్టణంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలోని డిస్ట్రిక్ స్పోర్ట్స్ అథారిటీ ఇండోర్ స్టేడియాన్ని ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య సోమవారం ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థులతో ముచ్చటించారు. స్టేడియం అభివృద్ధికి కావాలసిన ఎక్విప్‌మెంట్స్, సదుపాయాలు తదితర అంశాలను తెలుసుకున్నారు. ఏఎంసీ చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు, దాసరి నారాయణరావు, బొద్దులూరి రంగారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి..సీఎం వైఎస్ జగన్ ఘనతే

ఎమ్మెల్యే మేకతోటి సుచరిత



విద్యార్థుల తల్లులకు నగదు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే సుచరిత

పెదనందిపాడు: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి నాడు - నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేశారని ప్రత్తిపాడు ఎమ్మెల్యే మేకతోటి సుచరిత అన్నారు. అమ్మ ఒడి నగదు విడుల కార్యక్రమాన్ని సోమవారం పెదనందిపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే సుచరిత మాట్లాడుతూ పెదనందిపాడు మండలంలో 2,693 విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రూ.4,03,95,000లు జమ చేసినట్లు తెలిపారు. ఎంపీపీ టి.హెప్సిబా, వైఎస్ ఎంపీపీ షేక్ ఖాశింబీ, ప్రత్తిపాడు మార్కెట్ యార్డు డైరెక్టర్లు షేక్ ఖాశింపీరా, కొండాకృష్ణారెడ్డి, సర్పంచ్ దాసరి పద్మారావు, ఎంఈవో డి.బాలసుబ్రమణ్యం, హార్టి కల్చలర్ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి సాంబశివరావు పాల్గొన్నారు.

యువత అన్ని రంగాల్లో రాణించాలి

పెదకాకాని: యువత అన్ని రంగాల్లో రాణించాలని ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య అన్నారు. పెదకాకాని సెంటర్లో నూతన హోటల్‌ను ఆయన ప్రారంభించారు. పొన్నూరు మార్కెట్ యార్డ్ డైరెక్టర్ బందెల ఉదయ శంకర్ ఏర్పాటు చేసిన అభిరుచి హోటల్‌ను ప్రారంభించి, మాట్లాడారు. యువత ఉపాధి మార్గాలను ఎంపిక చేసుకొని రాణించాలన్నారు. ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ గోళ్ళ జ్యోతి, గ్రామ సర్పంచ్ గోళ్ళ స్వరూపరాణి తదితరులు పాల్గొన్నారు.

20 వరకు జగనన్న సురక్ష క్యాంపులు

వట్టిచెరుకూరు (ప్రత్తిపాడు): జగనన్న సురక్ష క్యాంపులను ఈ నెల 20వ తేదీ వరకు ఆయా సచివాలయాల వద్ద నిర్వహించడం జరుగుతుందని ఎంపీడీవో జి శేషగిరిరావు సోమవారం తెలిపారు. 4న చమళ్లమూడి, సోపాడు, 6వ తేదీన గారపాడు, వట్టిచెరుకూరు, 7న ముట్లూరు-1, వింజనంపాడు, 11న ముట్లూరు-2, 13న యామర్రులో, 14న కోవెలమూడిలో, 18న కొర్నెపాడులో, 20న కుర్నూతలలో క్యాంపులు జరగనున్నట్లు ఎంపీడీవో వివరించారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

దైవ చింతనతో.. మానసిక ప్రశాంతత

- ఎమ్మెల్యే మేకతోటి సుచరిత, దయాసాగర్
- గోరంట్ల వేంకటేశ్వరాలయంలో గురుపౌర్ణమి, సుదర్శన హోమం



సుదర్శన హోమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మేకతోటి సుచరిత, దయాసాగర్ దంపతులు

గుంటూరు రూరల్: దైవ చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్యే మేకతోటి సుచరిత, మచిలీపట్నం పోర్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ మేకతోటి దయాసాగర్ తెలిపారు. సోమవారం గోరంట్ల గ్రామంలోని వేంకటేశ్వర స్వామి దేవాలయంలో గురు పౌర్ణమి సందర్భంగా వారు ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆలయ పాలక మండలి సభ్యులు, వేద పండితులు ఎమ్మెల్యే దంపతులకు పూర్ణకుంభంతో సాదర స్వాగతం పలికారు. అనంతరం సుదర్శన హోమంలో పాల్గొన్నారు. స్వామివారి తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే దంపతులను ఘనంగా సన్మానించారు. వెంగళాయపాలెం గ్రామంలోని షిర్డీ సాయిరామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బాబా ఉత్సవ ఊరేగింపు నిర్వహించారు.

ఇంటిలో చోరీ

బైక్ సహా.. బీరువాలోని బంగారం, నగదు అపహరణ



బీరువాను పరిశీలిస్తున్న ఎస్ఐ రవీంద్రబాబు

నడింపాలెం (ప్రత్తిపాడు): ఇంటి ముందు పార్క్ చేసిన బైక్ సహా ఇంటిలో బీరువాలోని బంగారం ఆభరణాలు, నగదును గుర్తుతెలియని దుండగులు అపహరించుకుపోయిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. ప్రత్తిపాడు ఎస్ఐ డి.రవీంద్రబాబు వివరాల మేరకు.. ప్రత్తిపాడు మండలం నడింపాలెం సాయిప్రభు కాలనీకి చెందిన మాలెంపాటి వెంకటేశ్వర్లు ఆటో డ్రైవర్‌గా పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం రాత్రి 10.30 గంటల సమయంలో తన ద్విచక్ర వాహనాన్ని ఇంటి ముందు పార్క్ చేసి, వరండాలో నిద్రపోయాడు. సోమవారం తెల్లవారుజామున లేచి చూసేప్పటికీ ఇంటి ముందు బైక్ కనిపించకపోవడంతో పాటు, ఇంటి లోపల బీరువా తలుపులు తెరిచి ఉండటాన్ని వెంకటేశ్వర్లు గమనించాడు. బీరువాలో ఉండాల్సిన బంగారు చెవి పోగులు, మొబైల్, రూ.6 వేల నగదు లేకపోవడంతో ప్రత్తిపాడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఘటనా స్థలాన్ని ఎస్ఐ డి.రవీంద్రబాబు పరిశీలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

5న పాఠశాలల బంద్‌కు ఏబీవీపీ పిలుపు

గుంటూరు ఎడ్యుకేషన్: అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) పిలుపు మేరకు ఈనెల 5న రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలల బంద్ చేపడుతున్నట్లు సంఘ రాష్ట్ర సంయుక్త కార్య దర్శి సాయి చరణ్‌గుప్తా తెలిపారు. మార్కెట్ సెంటర్లోని హిందూ కళాశాల ప్రాంగణంలో ఏబీవీపీ నగర శాఖ ఆధ్వర్యంలో బంద్‌కు సంబంధించిన పోస్టర్లు విడుదల చేశారు. సాయి చరణ్‌గుప్తా మాట్లాడుతూ పాఠశాల విద్యారంగంలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోరు తూ రాష్ట్ర వ్యాప్త పాఠశాలల బంద్‌కు పిలుపునిచ్చినట్లు తెలిపారు. పాఠశాలల్లో ఖాళీగా ఉన్న 30వేల పోస్టులను డీఎస్సీ ద్వారా భర్తీ చేయడంతో పాటు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల కు పాఠ్య పుస్తకాలు, యూనిఫాం పంపిణీ చేయాలని కోరారు. సీబీఎస్ఈ పేరుతో ప్రైవే టు, కార్పొరేట్ పాఠశాలలు వసూలు చేస్తున్న అధిక ఫీజులను నియంత్రించడంతో పాటు ఫీజుల నియంత్రణకు కలెక్టర్, విద్యాశాఖాధికారులు, తల్లిదండ్రుల, విద్యార్థి సంఘాల భాగస్వామ్యంతో కమిటీలను నియమించాలని డిమాండ్ చేశారు. నారాయణ, శ్రీచైతన్య, భాష్యం వంటి కార్పొరేట్, ప్రైవేటు పాఠశాల ల్లో పుస్తకాలు, యూనిఫాం విక్రయాలను అరికట్టాలన్నారు. కార్యక్రమంలో విద్యార్థి నాయకులు రవి, ప్రసాద్, శ్రీకాంత్, దివాకర్, అంజి తదితరులు పాల్గొన్నారు.

ఏపీఈ సెట్‌లో పాలిటెక్నిక్ విద్యార్థులకు స్టేట్ ర్యాంక్‌లు



కె.మనీషా



కె.ఉషారాణి



ఎం.రాజేష్

గుంటూరు రూరల్: ప్రభుత్వ కళాశాలల్లో కార్పొరేట్‌కు దీటుగా నాణ్యమైన విద్యాబోధన జరుగుతుందనటానికి నిదర్శనం తమ కళాశాల విద్యార్థులు స్టేట్ ర్యాంక్‌లు సాధించటమేనని నల్లపాడు ప్రభుత్వ మైనారిటీ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.రాజశేఖర్ తెలిపారు. సోమవారం కళాశాలలో ఏర్పాటు చేసిన విద్యార్థుల అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తమ కళాశాలకు చెందిన కొత్తపల్లి మనీషా ఏపీఈసెట్‌లో ఎలక్ట్రానిక్స్ ఇనిస్ట్రుమెంటేషన్ విభాగంలో రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంకు సాధించిందన్నారు. కాశింశెట్టి ఉషారాణి, ములుపూరి రాజేష్ రాష్ట్ర స్థాయిలో 6వ స్థానం సాధించారని తెలిపారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను అధ్యాపకులు అభినందించారు.

దాతలసహాయం అభినందనీయం

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ అభివృద్ధికి దాతల సహాయం అభినందనీయమని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ అన్నారు. సోమవారం జీజీహెచ్ ఎనస్థీషియ విభాగం వారు, మమతా మెడికల్స్ అధినేత కె.చంద్రశేఖర్‌లు రూ. 50వేలు విలువ చేసే పరికరాలు సూపరింటెండెంట్‌కు అందజేశారు. ఎనస్థీషియా విభాగం వారు రోగుల కోసం గ్లౌజులు, సబ్బులు అందజేశారు. దాతలకు డాక్టర్ కిరణ్‌కుమార్ అభినదంనలు తెలిపారు.

చిరుధాన్యాలతో సంపూర్ణ పోషణ

గుంటూరు ఎడ్యుకేషన్: చిరుధాన్యాలతో శరీరానికి సంపూర్ణ పోషణ లభిస్తుందని యునివర్శిటీ ఆఫ్ హైదరాబాద్ ప్లాంట్ సైన్సెస్ విభాగ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం. ముత్తమిలరసన్ పేర్కొన్నారు. అంతర్జాతీయ చిరుధ్యానాల సంవత్సరాన్ని పురస్కరించుకుని సోమవారం సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాలలో బయోకెమిస్ట్రీ, ఫుడ్ టెక్నాలజీ విభాగాలు సంయుక్తంగా పొటెన్షియల్ ఆఫ్ మైటీ మిల్లెట్స్ అనే అంశంపై అతిథి ఉపన్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా హైదరాబాద్ నుంచి ఆన్‌లైన్ వేదికగా డాక్టర్ ముత్తమిలరసన్ పాల్గొని మాట్లాడుతూ చిరుధాన్యాల్లో మాంసకృతులు, ఖనిజాలతో అధిక పోషకాలు ఉన్నాయని వివరించారు. ప్రిన్సిపల్ డాక్టర్ వీఆర్ జ్యోత్స్నకుమారి పాల్గొన్నారు.

• నిర్లక్ష్యం గడ్డలు కట్టింది



పూర్తిగా గడ్డలు కట్టిన బస్తాలు



ఇప్పుడిప్పుడే గడ్డలు కడుతున్న సిమెంటు బస్తాలు

పాతమల్లాయపాలెం (ప్రత్తిపాడు): పాఠశాలల్లో నాడు-నేడు పనులపై ప్రభుత్వం ఎంత ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందో.. క్షేత్ర స్థాయిలో ఇంజినీరింగ్ అధికారులు అంతటి నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారు. అందుకు దర్పణమే ఈ చిత్రం. ప్రత్తిపాడు మండలం పాతమల్లాయపాలెంలో నాడు-నేడు పనులకు ప్రభుత్వం అందజేసిన సిమెంటు కట్టలను అధికారులు సకాలంలో వినియోగించేలా చర్యలు తీసుకోకపోవడంతో అవి పూర్తిగా గడ్డలు కట్టి నిరుపయోగంగా మారాయి. వాటిని అలానే పక్కన ఉంచి మరలా అధిక మొత్తంలో సిమెంటు బస్తాల నిల్వలు ఉంచడంతో పాటు, నిర్మాణ పనులు నెమ్మదిగా జరుగుతుండటంతో పక్కనే ఉన్న బస్తాలు కూడా ఒక్కొక్కటిగా గడ్డలు కట్టిపోతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు చర్యలు తీసుకుని సిమెంటు కట్టలు గడ్డలు కట్టకుండా త్వరితగతిన పనులు చేయించాలని గ్రామస్తులు కోరుతున్నారు.